# ★ మానవతి

● శ్రీమతి పులిపాక బాలాత్రిపురసుందరమ్మ

రామారావుగారి కాపురం బెజవాడ. ఎక్కువ గొప్పవారు కాకపోయినప్పటికి సామాన్యులలో స్థితిపరులు. రామారావుగారికి బెజవాడకోర్టులో నెలకు నలభైరూపాయల ఉద్యోగం. వీరికి ఏడుగురు కొమార్తెలు ముగ్గురు కొమాళ్లు. పెద్దకొమార్తె రాజేశ్వరి. రామారావుగారిభార్య సీతమ్మ. అల్లుండ్ల రాకపోకల మురిపములు తీర్చుకొనవలెననే కోరికతో శారదాబిల్లు హడావుడిలో తమ ఇంటివెనుక మాధవరావుగారి. కొమారుడికిచ్చి పెండ్లిచేశారు రాజేశ్వరికి. వారు సామాన్యస్థితిపరులే. పిల్లవాడు ఏదో చిన్నచదువు చదువుతున్నాడు. పెండ్లి అయినదిమొదలు ఏదో పేచిపెట్టడమేగాని ఒక్క పండుగకైన అత్తవారింటికి వచ్చి ఎఱుగడు రాఘవరావు. తరువాత సంవత్సరములోపల తీసుగరావలెనని పెండ్లికిచేసినంత ప్రయత్నముచేసి బంధువులను పిలచి అల్లుడిని రమ్మనిపిలిస్తే రానని అలిగాడు. కారణం అడిగితే. మోటారుసైకిలిస్తేగాని రానని కబురు. వీరికి వక్క అల్లుడుకాడు అడిగినదల్లాయివ్వడానికి. ఇవ్వలేక ఊరుకున్నారు. తరువాత మళ్లీ పండుగలకు పిలచినా కార్యకరామతులకు పిలచినా గుమ్మంలోకివచ్చి ఎఱుగడు. అల్లుడురాకుండా బెట్టుచేస్తే అడిగినదల్లా ఇస్తారనికాబోలు అతని అభిప్రాయం.

♦ ♦ ♦ ♦

రాజేశ్వరి పెద్దదైన రెండునెలల తరువాతనుంచి పంపమని మొదలుపెట్టారు అత్తవారు. ఏలాగో విశ్వప్రయత్నముమీద తరువాత ఆరునెలలు గడచినాయి. ఒకరోజు అల్లుడు కబురుచేశాడు 'ఈరోజు పిల్లను పంపితే సరే—లేకపోతె నేను రెండోపెండ్లి చేసుగుంటాను' అని.

రామారావుగారు చాలా మరియాదగలవాడు, గుణవంతుడు, బంధుప్రియుడు, జాలిహృదయుడు. ఈ కబురువినగానే హడలిపోయి పంపేశాడు.

♦ ♦ ♦ ♦

రాజేశ్వరి పదునాల్గేండ్లపిల్ల. పచ్చని పసిమిచాయ కన్నుముక్కు తీరుగలది. సామాన్యమైన తలకట్టు. పొట్టిగకురుచగా సామాన్యమైనపిల్ల. సంగీతము, కుట్లు, అల్లికలుఅన్నీ నేర్చుకున్నది. చాలానిదానం. మిక్కిలి వోర్పుకలది. పదిమాటలకు వక్కజవాబుకూడా చెప్పదు. సద్గుణములరాసి అని చెప్పాలి ఆపిల్లను. రాజేశ్వరి అత్తవారింటికివెళ్లి సంవత్సరమైంది. పంపమని ఎన్నితఫాలు అడిగినా పంపరు. ఇక రాజేశ్వరి దినచర్య స్థితి రోజు తలదువ్వుకోకూడదు, పువ్వులుపెట్టుకోకూడదు. పువ్వులుపెట్టుకుంటే బోగంవాళ్లతోసమానం. చెల్లెండ్రు ఎప్పుడైనా వస్తే అందరి ఎదుటమాట్లాడి పంపవలసిందేగాని ఏకాంతముగా మాట్లాడకూడదు. ఇంట్లో చదువుకొనుటగాని, అల్లుకొనుటగాని, పాడుకొనుటగాని అసలే పనికిరావు.

♦ ♦ ♦ ♦

సంక్రాంతి పండుగవస్తున్నది. పిల్లలంతా బొమ్మలు పెట్టుకుంటూ మంటున్నారు. రాజేశ్వరినికూడా తీసుగురావలెనని రామారావువెళ్లి పిన్నపెద్దల చేత చెప్పించి పండుగరోజు పంపుతాము అని వప్పించుకుని

వచ్చారు. తెల్లవారింది, ఆరోజె పండుగ. తొలకరి మెరపులాగ దొడ్డిగుమ్మంలో మెరసింది రాజేశ్వరి. తల్లీ అమ్మమ్మా పరమసంతోష భరితులైనారు. చెల్లెండ్రువచ్చి కౌగలించుకున్నారు 'సుశీలా! ఎందుకిల్లా నన్ను చుట్టుకుంటారు? నేనుండేది కొన్నిగంటలే కదా?' అని ముఖం చిన్నపుచ్చుకున్నది రాజేశ్వరి. అందరు తలంట్లు పోసుకున్నారు. అమ్మమ్మ వంటచేసింది. తరువాత కొంచంసేపటికి టైముచూచి అమ్మమ్మా నేను వెళ్లుతాను అన్నంపెట్టు అన్నది. 'మా నాన్నగారు ఇంటికొచ్చి చూచిందాకా నైనా ఉండవా? రాజేశ్వరీ! చెల్లెండ్రు బొమ్మలుపెట్టుకున్నారు సాయంకాలం పేరంటంచేసి వెళ్లుదుగాని' అని తల్లి దీనాలాపములుచేస్తున్నది. గాని ఏంలాభం? రాజేశ్వరి కంచంతెచ్చిపెట్టుకున్నది. 'అన్నంపెడితే నేను వెళ్లుతాను' అనిఅంటూ. భర్తఇచ్చినటైము అయిపోతున్నది. రాజేశ్వరి గుండె దడదడ కొట్టుకుంటున్నది. అమ్మమ్మ కంచంలో అన్నంపెట్టింది. పెట్టేదే తడవుగా కలుపుకుని తింటున్నది రాజేశ్వరి. 'నెయ్యి, వెయ్యనీయవే అమ్మా ఇదెక్కడ అత్తవారిల్లే తల్లీ' అని కండ్లుతుడుచుకుంటూ ఆవతలికి వెళ్లింది అమ్మమ్మ. ఇంతలో తండ్రి వస్తూ అంతదూరంనుంచే చూచి 'మాతల్లి వచ్చిందే మా రాజేశ్వరి; ఎప్పుడొచ్చావు తల్లీ! నేనుకూడా నీతో అన్నంతింటా. ఉండమ్మా ఎన్నాళ్లైంది మనం అందరం అన్నంతిని; లే సీతా! అన్నం తిందాం' అని చొక్కా వంకెకు తగిలించి పట్టుపంచ కట్టుకుంటున్నాడు రామారావు. సీత లేవలేదు, అక్కడే గోడకు చేరబడి కూర్చున్నది. 'ఎందుకల్లా కూర్చున్నావు? అమ్మాయికూడా వచ్చిందిగా' అన్నాడు సంతోషంగా రామారావు. 'వస్తేయేం? మళ్లీ వెళుతున్నది. అందుకే తొందరగా అన్నంతింటున్నది' అన్నది సీత దీనంగా. 'అదేమిటి? ఇప్పుడేవెళుతుందా? ఏం రాజేశ్వరి! ఇప్పుడే వెళుతావా?' 'వెళుతా నాన్నగారు ఇంట్లో పనిఉన్నది వెళ్లాలి.' అని అమ్మమ్మను మజ్జిగ పోయమన్నది. 'నిన్ను మరీ నోరులేందాన్నిచేసి వాళ్లు బాగా ఆడిస్తున్నారు. పంపారుగా సాయంకాలందాకా ఉండరాదు?' అని మజ్జిగపోసింది అమ్మమ్మ. 'మీరు ఇల్లా అంటారు వాళ్లు అల్లా అంటారు ఇద్దరిసందునా నలిగిపోతున్నాను' అని గద్గదకంఠంతో జవాబుచెప్పి అన్నంలోచేయి కడుక్కొనిలేచింది. ఇంతలో రాజేశ్వరిని పిలుచుకురమ్మన్నారు అని కబురు. వస్తున్నాను అని వెనక్కుతిరిగైన చూడకుండా కండ్లు తుడుచుగుంటూ వెళ్లింది రాజేశ్వరి. పట్టుపంచతో అల్లాగే కుర్చీలో కూలబడ్డాడు రామారావు. ఇల్లాగంటి సంబంధం నీవేచేశావని తన తల్లిమీద విసుక్కున్నది సీత ఏమితోచక.

♦ ♦ ♦ ♦

రామారావుగారి నాల్గవకొమార్తె వివాహం. బంధువులందరువచ్చారు. ఇళ్లూవాకళ్లు అన్నీ పచ్చతోరణములతో, ముత్యములతోరణములతో, రంగురంగుల విద్యుద్దీపముల తోరణములతో అలంకరింపబడి దేవేంద్రభవనంగా ఉన్నది ఇల్లు. పందిరిలో పంచవిధములైన మేళములు, ఎటుచూచినా ప్రతిబింబములు కనిపించు నిలువుటద్దములు, పండితులకు వకవైపునా, చూడవచ్చిన ప్రేక్షకులకు వకవైపునా, పెండ్లివారికి ఒకవైపునా, బంధువులకు వకవైపున వేరు ఏర్పాట్లుచేసి ఉన్నది పెండ్లిపందిరి. గాని సీతా, రామారావులకు ఏదో కొరత కనిపిస్తున్నది. అది రాజేశ్వరి రానికొరత వక్కటే. ఇక రాత్రికిపెండ్లి. అప్పుడువచ్చిన బంధువులలో ఒకపెద్దను పిలుచుగుని రామారావువెళ్లి బ్రతిమాలి రాజేశ్వరిని పసిబిడ్డను పిలుచుగుని అల్లుడిని వియ్యాలవారినికూడా వచ్చే ఏర్పాటుచేసుగుని వచ్చారు. ఆప్రొద్దున్న పలహారానికి మధ్యాహ్నము రాత్రి భోజనానికివచ్చాడు అల్లుడు. రాత్రి పదిగంటలైంది జయప్రదంగా కల్యాణం జరుగుతున్నది. ఆడవాళ్లల్లో

రాజేశ్వరి కూర్చున్నది. మగవాళ్లల్లో రాఘవరావు కూర్చున్నాడు. ఇక్కడ రాజేశ్వరి హడలిపోతూనే ఉన్నది. తలంబ్రాలు అయినాయి. చివాల్న లేచి లోపలిహాల్లోకివెళ్లి వక్కపొడి ఏది అంటూ రాజేశ్వరి వంకచూచి తలవిసరాడు రాఘవరావు. ఎందుకు? అని లోపలికివెళ్లింది రాజేశ్వరి. నెమ్మదిగా ఏదో ఒక మాటచెప్పి 'నేను వెళ్లుతున్నాను; నీవు ప్రొద్దున్నే రా' అని దొడ్డిదార్నె వెళ్ళాడు రాఘవరావు.

తెల్లవారింది. అందరు ముఖార్చనలు చేస్తున్నారు. రాజేశ్వరి ఇంకా నిద్రలేవలేదు. అప్పుడే కబురు రాజేశ్వరిని పిలుచుకురమ్మన్నారు అని. సరే లేచివెళ్లింది పిల్లను మంచముమీదనే ఒదిలేసి. రాఘవరావు గదిలో కుర్చీలోకూర్చుని కాఫీ త్రాగుతున్నాడు. అక్కడే గోడకు చేరబడి నుంచున్నది రాజేశ్వరి నిర్జీవంగా.

'ఇప్పుడు కొత్తఅల్లునితోపాటు ఐదువందలు నాకుఇస్తే నువ్వు అక్కడుండు నేనువస్తాను. లేకపోతే ఈరోజుతో నీకూనాకు తీరిపోయింది. పో మీవాళ్లింటికి ఫో; లేచిపో' అని రెండుతన్నులు తన్నాడు గాఢంగా. నుంచునిఉన్న రాజేశ్వరి కూలబడి వెక్కివెక్కి ఏడుస్తున్నది. ఇంతలో పిల్ల ఏడుస్తున్నదని అమ్మమ్మ కేకవేసింది. ఆకేకవిని కళ్లుతుడుచుకుని ముంగురులు సవరించుకొంటూ వచ్చింది రాజేశ్వరి. ఈ వైఖరి అంతా చూచి ఏదో జరిగిందనుకున్నారు అందరు. ఎవరో రహస్యముగా అడిగితే చెప్పింది ఉన్న యధార్థమంతా. ఆరోజు మొదలు రాజేశ్వరి లేవటంలేదు తల దువ్వుకొనుట అన్నము తినుటకూడా లేదు. కొంచము జ్వరము కూడా తగిలింది. అల్లాగె ఒక గదిలో పడుకుంటున్నది పిల్లను ఎవరో చూస్తూన్నారు.

♦ ♦ ♦ ♦

పెండ్లి నాల్గవనాటి రాత్రి తొమ్మిదిగంటలైంది గుమ్మమునకు ఎదురుగా ఆగింది పువ్వులపల్లకి ఊరేగింపుకు రానున్నవారందరు డ్రస్సు మార్చుకొనుట తాంబూలములు వేసుకొనుట ఇండ్లు సవరించుకొనుట ఎవరిపనిలోవారు నిమగ్నులై ఉన్నారు ఇంట్లోవారు. ముందువైపు గదిలో మంచంవేసి పిల్లను నిద్రపుచ్చి తాను కూడా ఆమంచంమీదనే నిద్రపోయింది రాజేశ్వరి. ఈ సమయంలో రాజేశ్వరి మంచందగ్గిర రాఘవరావు ప్రత్యక్షమయ్యాడు. ఎవరోచూచి రామారావుకు చెప్పారు పెద్దల్లుడొచ్చాడని. ఇంతలో పసిపిల్లను భుజమున పడుకోపెట్టుకుని రాజేశ్వరిచేయిపట్టుకుని 'రాజేశ్వరీ! నేను కావాలంటే ఇప్పుడు ఇంటికిరా. లేకపోతే ఇక్కడే ఉండు' అంటున్నాడు. ఇంతలో రామారావు వెళ్లి అల్లుడిచేయి పట్టుకుని 'రాఘవరావు తొందరపడకు ఇంట్లో ఇంత వైభవంగా పెండ్లి జరుగుతూంటే ఆపిల్ల లేవకపోయె, నీవూ రాకపోతివి, సరే కదా. ఇప్పుడు ఈచీకట్లో తీసుకెళ్లటమేమిటి?' అన్నాడు దీనంగా. 'చాలుచాలు ఊరుకోండి. మీ మరియాద తెలిసిపోయింది. మీరూ ఒకపెద్ద మనిషి ననుకుంటున్నారు కాబోలు. నోరుమూసుకుని అవతలికి పదండి.' అని చేయి విదలించి పారేశాడు అల్లుడు. 'నీ మరియాద నాకు తెలియదనుకుంటున్నావు కాబోలు నీ దుండగములన్నీ వింటూ చూస్తూ ఊరుకోడం నాచేతగాక కాదు నీవు చిన్నవాడవని తెలియదని ఆలోచించి ఊరుకుంటున్నాను. నీవు కొట్టే దెబ్బలకి మీ అమ్మ తిట్టేతిట్లకి నోరులేనిపిల్ల గనుక పడి ఉంటున్నది. ఛీ దుర్మార్గుడా. ఇంక ఏం చేద్దామని వచ్చావు అర్ధరాత్రి' అని దగ్గిరికి వెళ్లాడు మామగారు. 'నోరుమూయి బుద్ధితక్కువ పెద్దమనిషి' అని చేయిఎత్తాడు అల్లుడు. చప్పున రాజేశ్వరిలేచి 'నాన్నగారు మీకు నమస్కారం చేస్తా ఊరుకోండి!' అని తండ్రి నోటికి చేయి అడ్డంపెట్టి భర్తకాళ్లు పట్టుకుని 'నేను వస్తా పదండి మనం వెళదాము' అని ఇద్దరిమధ్యా వొరిగింది రాజేశ్వరి. ఆ కరుణామయదృశ్యం చూచేటప్పటికి ఆ ఊరేగింపు నిమిత్తం వచ్చియున్న స్త్రీ పురుషులెల్లరి మనస్సులు గభీర దుఃఖపూరితములైనాయి—